# COMMUNIST PARTY OF INDIA (MARXIST)

# ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


విజయవాడ,

తేది : 10 జూన్, 2020.

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గారికి,**

గౌరవ ముఖ్యమంత్రి,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,

వెలగపూడి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

విషయం : **ఆంధ్రప్రదేశ్‌లో ప్రయివేటు విద్యా సంస్థలను కార్పొరేటు మరియు బడ్జెట్ పాఠశాలలుగా విభజించాలని, రెగ్యులేటరీ కమీషన్ పరిధి నుండి మినహాయించాలని కోరుతూ...**

**ఆర్యా!**

ఆంధ్రప్రదేశ్‌లో గత 40 సంవత్సరాలుగా విద్యా రంగంలో ప్రయివేటు విద్యా సంస్థల్ని అర్హత కలిగిన యువకులు ఉద్యోగావకాశాలు లేక మారుమూల ప్రాంతాల్లో ప్రారంభించారు. వారు ఉపాధి పొందుతూ మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నటువంటి సంస్థలే ఈ బడ్జెట్ పాఠశాలలు. రాష్ట్రవ్యాపితంగా ఈ పాఠశాలలు 12 వేలకుపైగా ఉన్నాయి. రాష్ట్రంమొత్తం మీద ప్రభుత్వంగానీ, ప్రయివేటు సంస్థల్లోగానీ 70 లక్షల మంది చదువుకుంటుంటే బడ్జెట్ పాఠశాలల్లో 30 లక్షల మంది చదువుతున్నారు. కార్పొరేట్ స్కూళ్ళలో 4 లేదా5 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. రాష్ట్రంలో ఈ బడ్జెట్ పాఠశాలలు 12 వేలుంటే కార్పొరేట్ పాఠశాలలు కేవలం 1100 ఉన్నాయి. బడ్జెట్ స్కూళ్ళలో ఉపాధ్యాయులుగానూ, ఉపాధ్యాయేతరులుగానూ 3 లక్షల 50 వేల మంది ఉపాధి పొందుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో విద్యాసేవలనందించే సంస్థలుగా ఇవి ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో సరైనటువంటి వసతులు, ఉపాధ్యాయ సిబ్బంధి లేక ఈ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. వ్యాపార దృక్పథంతోకాక కేవలం జీవన భృతికోసం ఏర్పాటు చేసుకున్న ఈ విద్యా సంస్థలివి. ఆంధ్రప్రదేశ్ పాఠశాల ఫీజు రెగ్యులేటరీ కమీషన్ మరియు మానిటరింగ్ కమిటీ పరిధిలోకి వీటిని తీసుకువస్తే వీటి మనుగడే ప్రమాదంలో పడుతుంది. రెగ్యులేటరీ కమీషన్ నిబంధనల ప్రకారం బడ్జెట్ స్కూళ్ళు ఇప్పటికిప్పుడు మౌళిక సదుపాయాలు ఏర్పాట్లు చేయడం సాధ్యంకాదు. భవనాలు ఇతర మౌళిక సదుపాయాలు బాగా ఖర్చుతో కూడుకున్న అంశం. ఈ సంస్థల రాబడికి మించిన అంశం ఇది. ఈ సంస్థలలో 100 మంది నుండి 1000 మంది విద్యార్థుల వరకు ఉంటే, 10 మంది నుండి 100 మంది సిబ్బంధి వరకు ఉపాధి పొందుతున్నారు. చాలా మంది గ్రాడ్యుయేట్స్, పోస్టు గ్రాడ్యుయేట్లు దశాబ్దాల కాలంగా ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులుగా ఎన్నో అనుభవాలు గడించి భోధిస్తున్నారు. రెగ్యులేటరీ కమీషన్ వారి నిబంధన ప్రకారం వారిని తొలగించాల్సి వుంటుంది. వారు ఉపాధి కోల్పోవడంతోపాటు క్వాలిఫైడ్ టీచర్లు ఈ రోజు అందుబాటులో లేరు. ఈ కారణంగా ఈ సంస్థల్ని మూసివేయాల్సిన పరిస్థితి వస్తుంది. కనుక కార్పొరేట్ సంస్థలకి వర్తింపజేసేటటువంటి నిబంధనలు బడ్జెట్ స్కూళ్ళకి వర్తింపజేయరాదని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఈ కోవిడ్ 19 విపత్కర పరిస్థితుల్లో మార్చి 18వ తేదీ నుండి ఈ పాఠశాలలు నిరవధికంగా మూతపడి ఉన్నాయి. సిబ్బంధికి ఆర్థికంగా సహకారము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందలేదు. జూన్, జూలై, ఆగష్టులలో బడ్జెట్ స్కూళ్ళలో సిబ్బంధికి వేతనాలు చెల్లించడం కూడా ప్రయివేటు యాజమాన్యాలకు సాధ్యంగాదు. ఇలాంటి స్కూళ్ళను కార్పొరేట్ స్కూళ్ళతో ముడిపెట్టడం ఏరకంగానూ సమంజసం కాదు. కనుక బడ్జెట్ స్కూళ్ళు నిలదొక్కుకోవడానికి వీలుగా ప్రభుత్వం కార్పొరేట్ స్కూళ్ళ నిబంధనల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నాం. వార్షికంగా రూ.20వేలు లోపు ఫీజులు ఉన్న విద్యా సంస్థలను బడ్జెట్ పాఠశాలలుగా పరిగణించవలసిందిగా కోరుచున్నాను.

అభివందనములతో...

**(పెనుమల్లి మధు)**

రాష్ట్ర కార్యదర్శి